



APTEL/2015/65279

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24






సంపుటి :9 సంచిక : 234 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 29-01-2023 ఆదివారం పేజీలు :4 వెల : రూ.3/-


# బలహీనవర్గాల అభివృద్ధే మంత్రం: మోదీ




**జైపూర్:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'వెనుకబడిన వారికే ప్రాధాన్యత' అనే నినాదంతోనే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. రాజస్థాన్‌లోని గుర్జార్ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు దేవుడిగా ఆరాధించే దేవనారాయణుడి 1111వ జయంతి ఉత్సవాలకు మోదీ హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బిల్వాడా జిల్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యావత్ ప్రపంచం ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందన్న ఆయన.. అన్ని రంగాల్లోనూ భారత్ తన సత్తాను చాటుతోందని చెప్పారు.

ఇతర దేశాలపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించుకుంటూ.. స్వశక్తితో భారత్ ఎదుగుతోందని మోదీ తెలిపారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంతోపాటు ఇతర ఉద్యమాల్లో గుర్జార్ సామాజిక వర్గానికి చెందిన ప్రజల తెగువను ప్రశంసించారు. అయితే, అలాంటి ధీరత్వం కలిగిన వ్యక్తులకు చరిత్రలో తగిన స్థానం దక్కకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాలు చేసిన పొరపాట్లను ప్రస్తుతం దిద్దుకుంటూ వెళ్తున్నామన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగినా.. అవేవీ ఫలించలేదన్న మోదీ.. భారత్ కేవలం భూభాగం మాత్రమే కాదు.. ఓ నాగరికత, సంస్కృతి అని అన్నారు. గత ఎనిమిది తొమ్మిదేళ్లుగా సమాజంలోని ప్రతి వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించిందని చెప్పారు. రైతులకు మేలు జరిగేలా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రూ.15,000 కోట్లు రాజస్థాన్‌కు మంజూరు చేసినట్లు మోదీ వెల్లడించారు.

**సెలవు ప్రకటించిన రాజస్థాన్ ప్రభుత్వం**

సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న దేవ్‌నారాయణ్ జయంతి ఉత్సవాలకు మోదీ హాజరైనప్పటికీ.. ఆయన పర్యటనపై రాజకీయంగా ఆసక్తి నెలకొంది. మరో 10 నెలల్లో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రధాని పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. రాష్ట్ర జనాభాలో 9 నుంచి 12 శాతం మంది ప్రజలు గుర్జార్ సామాజిక వర్గానికి చెందిన వారే ఉంటారు. తూర్పు రాజస్థాన్ ప్రాంతంలోని దాదాపు 40 నుంచి 50 అసెంబ్లీ స్థానాల్లో వీళ్ల ఓట్లు చాలా కీలకం. ఈ నేపథ్యంలో రాజకీయ ఎత్తుగడతోనే ప్రధాని రాష్ట్ర పర్యటకు వచ్చారని కాంగ్రెస్ విమర్శిస్తోంది. అయితే, ప్రధాని రాకను పురస్కరించుకొని ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ రాష్ట్ర వ్యాప్తంగా సెలవు ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో.. ప్రధాని రాక సందర్భంగా సెలవు ప్రకటించడం చర్చనీయాంశమైంది.










# రాష్ట్రంలో సామాన్యులు బతికే పరిస్థితి లేదు

## - రెండో రోజు పాదయాత్రలో లోకేష్



**కుప్పం:** వివిధ వర్గాలను అక్కున చేర్చుకుంటూ.. విద్యార్థుల్లో జోష్ నింపుతూ.. పల్లె ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. బీసీలకు భరోసానిస్తూ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర రెండో రోజు ఉత్సాహంగా సాగింది. కుప్పంలోని బీఈఎస్ వైద్యకళాశాల వద్ద నుంచి ప్రారంభమైన రెండో రోజు పాదయాత్ర పెగ్గిలిపల్లి, గణేష్‌పురం క్రాస్, కడపల్లి, కలమలదొడ్డిల మీదుగా శాంతిపురం వరకు 10 కిలోమీటర్ల మేర సాగింది. తనను కలిసిన వివిధ వర్గాల ప్రజలను ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చైతన్యపరుస్తూ నారా లోకేశ్ ముందుకు సాగారు. గుడుపల్లె మండలం బెగ్గిపల్లెలో కురబ కులస్థులతో లోకేశ్ సమావేశమయ్యారు.

**రాష్ట్రంలో సామాన్యులు బతికే పరిస్థితి లేదు..**

కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద లోకేశ్‌కు ఘన స్వాగతం లభించింది. విద్యార్థులు లోకేశ్ కటౌట్‌కి పాలాభిషేకం చేశారు. చంద్రబాబు తమ ప్రాంతానికి డిగ్రీ కళాశాల తెచ్చిన కృతజ్ఞతతో అభిమానం చాటుకున్నామని విద్యార్థులు తెలిపారు. జగన్ సీఎం అయ్యాక ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి రాకపోగా ఉన్న పరిశ్రమలు తరలిపోయాయని ఈ సందర్భంగా లోకేశ్ విమర్శించారు. పరిశ్రమలు తరలిపోతే విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. తమ భవిష్యత్తు కోసం విద్యార్థులు యువగళంలో భాగస్వాములు అవ్వాలని లోకేశ్ పిలుపునిచ్చారు. వడ్డిపల్లి గ్రామానికి చెందిన మద్దేటి రిషికేష్, అశ్వని దంపతులు చంటి బిడ్డతో వచ్చి లోకేశ్‌ను కలిశారు. బిడ్డకు పేరు పెట్టాలని తల్లిదండ్రులు కోరగా.. సాన్విత అని లోకేశ్ సూచించారు. గణేష్‌పురం క్రాస్‌లో స్థానిక మహిళలు, రైతులతో మాట్లాడారు. నిత్యావసర సరకుల ధరలు పెరిగి బతుకుభారం అవుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు బలవంతంగా పెడుతున్నారంటూ రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రాష్ట్రంలో సామాన్యులు బతికే పరిస్థితి లేదని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ మీటర్ల కొనుగోలులో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు.

**వ్యవసాయ మంత్రి కోర్టు ఫైల్ ఎత్తుకెళ్లిన దొంగ..**


శాంతిపురం మండలం ఏడోమైలు గ్రామానికి పాదయాత్ర చేరుకున్న సందర్భంగా టమోటా రైతులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రైతు భరోసా కేంద్రాలు ఓ మోసం, ఆర్బీకేలలో నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు లేవు. వ్యవసాయమంత్రి కోర్టులో ఫైల్ ఎత్తుకెళ్లిన దొంగ. టమోటా రైతులను ఆదుకోవడానికి టమోటా సాస్ పరిశ్రమ పెడతానని చెప్పి మోసం చేశారు. న్యాయం కోసం టమోటా రైతులు పోరాడాలి. అధికారంలోకి వచ్చాక టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. రాష్ట్రంలో పాడిపరిశ్రమను నాశనం చేశారు. అమూల్ తెచ్చి రైతులకు ఏం లాభం చేశారు" అని లోకేశ్ ప్రశ్నించారు. కమలదొడ్డిలో భోజన విరామం అనంతరం బీసీలతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. అక్కడి నుంచి శాంతిపురం వరకు యువనేత పాదయాత్ర సాగింది.

# వివేకా హత్య కేసులో సీబీఐ విచారణకు హాజరైన ఎంపీ అవినాష్‌రెడ్డి

**హైదరాబాద్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా కడప ఎంపీ అవినాష్ రెడ్డి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు. తొలిసారి సీబీఐ విచారణకు ఆయన హాజరయ్యారు. ఈ కేసులో ఇప్పటికే 248 మంది వాంగ్మూలాన్ని సీబీఐ అధికారులు సేకరించారు. ఈ వాంగ్మూలాల ఆధారంగా.. ఎస్పీ రాంసింగ్ నేతృత్వంలోని సీబీఐ బృందం అవినాష్ రెడ్డిని ప్రశ్నిస్తోంది. ఆయన తరఫు న్యాయవాదిని అధికారులు గదిలోకి అనుమతించలేదు. సీబీఐ కార్యాలయానికి ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాసులతో పాటు అవినాష్ అనుచరులు భారీగా చేరుకున్నారు.

మధ్యాహ్నం 3గంటలకు విచారణకు హాజరుకావాలని అవినాష్‌రెడ్డికి సీబీఐ అధికారులు పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మధ్యాహ్నం 2.45 నిమిషాలకు సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు. అవినాష్‌రెడ్డితో పాటు న్యాయవాది నగేశ్ కూడా ఉన్నారు. అంతకుముందు తన విచారణను ఆడియో, వీడియోలు రికార్డు చేయాలని.. తనతో పాటు న్యాయవాదిని కూడా అనుమతించాలని అవినాష్‌రెడ్డి సీబీఐ అధికారులకు లేఖ రాశారు. అయితే, ఈ లేఖకు సంబంధించి అధికారులు సమాధానం ఇచ్చారా? లేదా? అనేదానిపై స్పష్టత లేదు.

వివేకా హత్య కేసుకు సంబంధించి దాదాపు మూడేళ్లుగా సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. 2019 మార్చిలో వివేకా హత్య జరిగినప్పటి నుంచి దాదాపు ఏడాది తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసు విచారణను ప్రారంభించింది. ఇప్పటికే 248 మందిని ప్రశ్నించి వారి నుంచి వాంగ్మూలాన్ని సీబీఐ అధికారులు సేకరించారు. ఇంతమందిని ప్రశ్నించినప్పటికీ తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్‌రెడ్డిని మాత్రం ఇప్పటి వరకు ప్రశ్నించలేదు. ప్రతిపక్షాలు కూడా ప్రధానంగా అతనిపై వేలెత్తి చూపుతున్న నేపథ్యంలో పూర్తి సమాచారం సేకరించిన తర్వాతే అవినాష్‌రెడ్డిని ప్రశ్నించాలని సీబీఐ అధికారులు భావించారు. ఇందులో భాగంగానే ఆయనకు నోటీసులు జారీ చేసి విచారణకు హాజరుకావాల్సిందిగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అవినాష్‌రెడ్డి ఇవాళ విచారణకు హాజరయ్యారు.



**మళ్లీ పిలుస్తామన్నారు.. సీబీఐ విచారణకు సహకరిస్తా: అవినాష్‌రెడ్డి**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా కడప ఎంపీ అవినాష్ రెడ్డి సీబీఐ విచారణ ముగిసింది. ఇవాళ మధ్యాహ్నం 3 గంటల నుంచి కోఠిలోని సీబీఐ కార్యాలయంలో అవినాష్‌రెడ్డిని సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ నేతృత్వంలోని బృందం విచారించింది. ఈ కేసులో ఇప్పటికే 248 మంది వాంగ్మూలాన్ని సీబీఐ అధికారులు సేకరించారు. ఈ వాంగ్మూలాల ఆధారంగా.. ఎస్పీ రాంసింగ్ నేతృత్వంలోని సీబీఐ బృందం అవినాష్ రెడ్డిని ప్రశ్నించింది. సీబీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన అనంతరం అవినాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "సీబీఐ అధికారులు ఇచ్చిన 160 సీఆర్‌పీసీ నోటీసుల ప్రకారం విచారణకు హాజరయ్యా. విచారణ పారదర్శకంగా జరగాలని సీబీఐని కోరా. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చాను. సీబీఐ అధికారులకు ఉన్న అనుమానాలను నా సమాధానాలతో నివృత్తి చేశా. మళ్లీ ఎప్పుడు విచారణకు రమ్మన్నా వస్తానని చెప్పా. ప్రజలకు కేసుకు సంబంధించిన వివరాలు తెలియాలని వీడియో, ఆడియో అనుమతి కోరా. అందుకు అధికారులు అంగీకరించలేదు. నాలుగున్నర గంటల పాటు సీబీఐ అధికారులు నన్ను విచారించారు. విచారణకు సంబంధించిన విషయాలు ఏవీ ఇప్పుడు బహిర్గతం చేయలేను. కొన్ని మీడియా సంస్థలు పనిగట్టుకుని నాపై దుష్ప్రచారం చేస్తున్నాయి" అని అవినాష్ రెడ్డి తెలిపారు.



# జర్మనీ నిర్ణయం సబబేనా?

ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం రేపో మాపో పరిసమాప్తం కాకతప్పదని, పెను సంక్షోభంలో చిక్కుకున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు కోలుకోవటం మొదలవుతుందని ఆశిస్తున్నవారిని తాజా పరిణామం తీవ్ర నిరాశలోకి నెట్టింది. ఉక్రెయిన్‌కు లెపార్డ్ 2 రకం భారీ యుద్ధ ట్యాంకులు అందజేయడానికి గత కొన్ని నెలలుగా ససేమిరా అంటున్న జర్మనీ ఎట్టకేలకు తన నిర్ణయాన్ని మార్చుకుంది. యుద్ధంలో ఆయుధ సంపత్తి ప్రధానమే కావొచ్చుగానీ... ప్రతిఘటనదారుల సంకల్పబలం ముందు అవి దిగదుడుపేనని యుద్ధ నిపుణులంటారు. ఒక చిన్న దేశం వియత్నాం ముందు అరవయ్యో దశకంలో అమెరికా చిత్తయిన ఉదంతం మొదలుకొని తాజాగా రష్యాపై ఉక్రెయిన్ సాగిస్తున్న ప్రతిఘటన వరకూ అది రుజువవుతూనే ఉంది. నెలరోజుల్లో ఉక్రెయిన్‌ను పాదాక్రాంతం చేసుకోవాలనుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ ఏడాది గడిచాక దాన్నుంచి బయటి కొచ్చే దారీతెన్నూ కానక ఆపసోపాలు పడుతున్నారు.

అందరూ ఏకమై పుతిన్ మెడలువంచి ఆయన్ను చర్చలకు ఒప్పించాల్సివున్న ఈ తరుణంలో ఉక్రెయిన్‌కు ఆయుధాలందిస్తూ ఆ యుద్ధాన్ని మరింత సాగదీసేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. అయితే జర్మనీ అంత సులభంగా ట్యాంకు లివ్వటానికి అంగీకరించలేదు. అమెరికా తన ఎం1 అబ్రామ్ ట్యాంకుల్ని కూడా తరలించేందుకు ఒప్పుకుంటేనే లెపార్డ్ 2 ట్యాంకులు అందిస్తామన్న షరతు విధించింది. ఈ విషయంలో జర్మనీ చాన్సలర్ ఒలోఫ్ షల్జ్ మనసు మారేలా చేసేందుకు అమెరికా అన్నివిధాలా ప్రయత్నించింది. జర్మనీలోని పాలక, ప్రతిపక్షాలతోపాటు నాటో కూటమి దేశాలు సైతం షల్జ్‌పై ఒత్తిళ్లు తెచ్చాయి. నేరుగా ఉక్రెయిన్‌కు ఇవ్వటం అభ్యంతరమైతే తమకు సరఫరా చేసిన లెపార్డ్‌లివ్వటానికైనా అనుమ తించాలని పోలెండ్ గత కొన్ని వారాలుగా డిమాండ్ చేస్తోంది. నిజానికి ఇది ట్యాంకు లివ్వటంతో ఆగదు. విమాన విధ్వంసక చీతా ట్యాంకులివ్వాలని కూడా జర్మనీపై ఒత్తిడి ఉంది. వాటితోపాటు ఉక్రెయిన్ ఎఫ్%--%16 యుద్ధ విమానాలివ్వాలని చాన్నాళ్లుగా అమెరికాను కోరుతోంది.

ఉక్రెయిన్‌కు ఏడాదిగా జర్మనీ చేస్తున్న సాయం తక్కువేం కాదు. కానీ అదంతా నాటో కూటమి సాయంలో భాగంగా ఉంది. ప్రత్యక్షంగా ట్యాంకులు పంపటం మొదలైతే ఆ చర్య రష్యాను రెచ్చ గొడుతుందన్న భయం షల్జ్‌కి ఉంది. అదే జరిగితే ఆర్థికంగా, సైనికంగా కూడా జర్మనీ నష్టపోతుందని ఆయన అంచనా. దానికితోడు అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ పుణ్యమా అని జర్మనీకి ఆ దేశంపై ఎన్నో సంశయాలున్నాయి. యుద్ధంలోకి దిగాక చివరివరకూ అమెరికా అండగా ఉంటుందా అన్నది దాని ప్రధాన సందేహం. అబ్రామ్ ట్యాంకులు విడుదల చేయటం ససేమిరా కుదరదని అధ్యక్షుడు బైడెన్ చెప్పటం ఆ సందేహాన్ని మరింత పెంచింది. అమెరికా రక్షణమంత్రి లాయిడ్ ఆస్టిన్ జర్మనీని ఈ విషయంలో ఒప్పించటానికి అన్నివిధాలా ప్రయత్నించి విఫలమయ్యాక చివరకు బైడెన్‌ను అంగీకరింపజేయగలిగారు. అయితే తన అమ్ములపొదిలో ఉన్న ట్యాంకులు కాకుండా తయారీదారులనుంచి కొనుగోలు చేసుకోవాలని అమెరికా అంటోంది. జర్మనీకి మరో సమస్య కూడా ఉంది. దానిదగ్గర ప్రస్తుతం లెపార్డ్ 2 ట్యాంకులు భారీ సంఖ్యలో లేవు. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో 4,000 వరకూ ఉండే ఆ ట్యాంకుల సంఖ్య ఇప్పుడు 300కు పడిపోయింది. వాటిని పెంచుకోవాలంటే చాన్నాళ్లు పడుతుంది. పైగా తోటి యూరప్ దేశాలకు ఇప్పటికే ఎగుమతి చేసిన ట్యాంకులకు విడి భాగాలు అందించాల్సివుంది. నిజానికి అమెరికా సైతం అలాంటి అభ్యంతరమేచెప్పింది. ప్రస్తుతం తమ బలగాల దగ్గరున్న 4,000 ట్యాంకులు దేశ భద్రతరీత్యా కదల్చటం సాధ్య పడదంటున్నది. అందుకు బదులు కొనుగోలు చేసుకోవాలంటున్నది. అమెరికా తయారీ అబ్రామ్ లముందు లెపార్డ్‌లు కొంత తీసికట్టే. గల్ఫ్ యుద్ధంలో, 2003 నాటి ఇరాక్ దురాక్రమణలో, అఫ్ఘానిస్తాన్ దురాక్రమణలో అమెరికాకు అబ్రామ్స్‌లు అక్కరకొచ్చాయని సైనిక నిపుణులంటారు. అయితే ఇందుకు ఎంతో సమన్వయం అవసరం. అఫ్ఘాన్‌లో మందుపాతరలనూ, ఇతర బాంబు దాడులనూ అవి తట్టుకున్నాయి. కానీ వాటి సాంకేతికత అత్యంత సంక్లిష్టమైనది. నెలల తరబడి శిక్షణ ఉంటేనే వాటిని వినియోగించటం సాధ్యం. అదీగాక అబ్రామ్‌ల వ్యయం, వాటి విడి భాగాలు భారీ ఖర్చుతో కూడుకున్నవి. ఈ విషయంలో లెపార్డ్‌లు మెరుగే అయినా వాటిపైన కూడా ప్రత్యేక శిక్షణ అవసరం. అందువల్ల తక్షణం ఈ ట్యాంకులు యుద్ధ క్షేత్రానికి రాలేవు.

తనపై నేరుగా లడాయికి దిగే ధైర్యం నాటోకు ఉండదని, ఆ కూటమిలో చీలిక రావటం ఖాయమని మొదటినుంచీ అనుకుంటున్న రష్యాకు జర్మనీ నిర్ణయం శరాఘాతమే. నేరుగా తమ గడ్డపై దాడి చేయగల భారీ ట్యాంకుల్నీ, అధునాతన యుద్ధ విమానాలనూ మోహరిస్తే ఆత్మ వినాశనం కొని తెచ్చుకున్నట్టేనని రష్యా చేస్తున్న హెచ్చరికల సారాంశం పుతిన్ మొదటినుంచీ బెదిరిస్తున్న అణుయుద్ధమే అయితే ప్రపంచానికి చేటుకాలం దాపురించినట్టే. తమ ఆహార అవస రాల్లో 80 శాతం వరకూ ఉక్రెయిన్‌పైనే ఆధారపడ్డ ఈజిప్టువంటి దేశాలు ఇప్పటికే సంక్షోభంలో పడ్డాయి. ఇతరత్రా ఉత్పత్తులు మందగించి ప్రపంచ దేశాలన్నీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పరిస్థితి మరింత క్షీణించేలా మారణాయుధాలు తరలించటంకాక యుద్ధం ఆపేందుకు అవసరమైన ఇతరత్రా చర్యలన్నిటిపైనా దృష్టి సారించాలి. ఆ విషయంలో శాంతిని కోరుకునే ప్రపంచ ప్రజానీకం ఒత్తిళ్లు తీసుకురావాలి. అప్పుడు మాత్రమే పరిస్థితి కుదుటపడుతుంది.

# వైభవంగా శ్రీ వెంకటేశ్వరుని వాహన సేవలు



**(వి న్యూస్ మచిలీపట్నం):** మచిలీపట్నం లో బచ్చుపేటలో వెంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రథసప్తమి సందర్భంగా సప్త వాహనాలపై దేవుడిని ఊరేగించారు. పుర వీధుల్లో సప్త వాహనాల్లో దేవుడ్ని ఊరేగించడంతో భక్తులు స్వామి వారిని ఆయా వాహన సేవల్లో పాల్గొని తరించారు. తొలుత సూర్య ప్రభ వాహనం, శేషవాహనం, గరుడ, హనుమంత, సర్వ భూపాల వాహనం, అశ్వవాహనం, చంద్ర ప్రభ వాహనాల పై స్వామి వారి ఊరేగింపు పుర వీధుల్లో సాగింది. రాత్రి అశ్వవాహనం పై దాదాపు 200 మంది మహిళలు దీపాలతో ఊరేగింపుగా పుర వీధుల్లో స్వామి వారి వాహన సేవలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో దేవస్థాన ఛైర్మెన్ ముక్తేవి రవికాంత్, దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 11వ పి .ఆర్ .సి బకాయిలు తక్షణం చెల్లించాలి

## - ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక,సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం....

**(విన్యూస్, విజయవాడ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక సమస్యలు ఏ ఒకటి పరిష్కారం కావడం లేదని అందుకోసం మరో పోరాటం అవసరం ఉన్నదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జి.ఓబులేసు తెలిపారు. 11వ పిఆర్సి వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని, డి.ఎ,అరియర్స్ ఇవ్వాలని,వాడుకున్న జి.పి.ఎఫ్ మొత్తాలను వెంటనే చెల్లించాలని, పెన్షనర్లకు నెల నెలా ఒకటో తేదీకి పెన్షన్ ఇవ్వాలని, ఉద్యోగస్తులకు సక్రమంగా జీతాలు చెల్లించాలనే,డిమాండ్లపై 28వ తేదీ విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలు నందు రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన వహించారు. ఏఐటియూసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య స్వాగతం పలికి వ్యక్తులను ఆహ్వానించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఉద్యోగ,ఉపాధ్యాయ ,కార్మికులను తక్కువ చేసి చూస్తూ వారి వేతనాలకు సంబంధించిన పి.ఆర్.సి ఐ.ఆర్ ను ముందు 27% ప్రకటించి, పిట్‌మెంట్‌ను 23 శాతానికి కుదించి ఇవ్వడం అన్యాయమని, పొరుగు రాష్ట్రమైన తెలంగాణ కంటే తక్కువ ఇవ్వడం దుర్మార్గమని,పి.ఆర్.సి కోసం ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మికులు రోడ్లపైకి వచ్చి ఉద్యమించితే తప్ప ఇవ్వడానికి నిరాకరించారని గత ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మికులు నడిపిన పోరాటంతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిందని అయినా వారి సమస్యలు పూర్తిగా పరిష్కరించకుండా దోబూచులాడుతూ యూనియన్ నాయకుల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వ సలహాదారుల సలహాలు కూడా తీసుకోవడం లేదని ముఖ్యమంత్రి మొండిగా వ్యవహరిస్తూ, నియంతల పాలన సాగిస్తున్నాడని,ఈ పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.ఇటీవల అమరావతి జేఏసీ నాయకులు తమ సమస్యలపై గవర్నర్ కలిసి విన్నవించుకుంటే ఆ సంఘం నాయకుడు సూర్యనారాయణను బెదిరిస్తూ మీ యూనియన్ ఎందుకు



రద్దు చేయకూడదో తెలపాలని నోటీసులు ఇవ్వడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు అని తెలిపారు.

అమరావతి జేఏసీ జనరల్ సెక్రెటరీ వై.వి రావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ విలీనంతో ఏమో ఒరగా బెట్టుతామని గొప్పలు చెప్పారని గతము కంటే నేడు అధ్వానంగా తయారైందని తెలిపారు. ఎన్జీవో పెన్షన్ దారుల సంఘ నాయుకుడు నాగరాజు మాట్లాడుతూ అనేక సంవత్సరాలు సర్వీస్ చేసి దాచుకున్న డబ్బులు జిపిఎఫ్ సొమ్మును ప్రభుత్వాలు తస్కరించాయని ఇది పెన్షన్ వాళ్ళ ఉసురు ప్రభుత్వాలకు తప్పక తగులుతుందని దుయ్యబట్టారు. ఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు అనేకం ఉన్నాయని ఏ ఒక్కటి పరిష్కరించకుండా దొంగ నాటకాలు ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .

పైగా సోషల్ మీడియాలో ఉపాధ్యాయుల ఉద్యోగుల గురించి కామెంట్ చేయడం సరైనది కాదని హితవుపలికారు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గిరిబాబు మాట్లాడుతూ మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆప్కాస్ వల్ల ఒరిగిందేమీ లేదని నేడు నిరక్షరాస్య మున్సిఫల్ కార్మికులకు సెల్ ఫోన్ లో పేస్ రీడింగ్ హాజరు పెట్టడం దుర్మార్గమని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి. రాధాకృష్ణమూర్తి,దోనేపూడి.శంకర్ ,తదితరులు మాట్లాడారు. అనంతరం సమావేశం క్రింది కార్యచరణను ప్రకటించింది.

సమావేశ అనంతరం ఫిబ్రవరి 3వ తేదీకి గత ఏడాది ఉద్యమం జరిగి సంవత్సర కాలం అవుతున్న దృష్ట్యా ఉద్యోగ,ఉపాధ్యాయ విశ్రాంతా, ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారానికి నోచుకోని నేపథ్యంలో వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని ఉద్యోగుల ఆర్థిక ఆర్థికేతర సమస్యలపై చర్చలు జరిపి పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 3వ తేదీన ఒక్కరోజు సామూహిక నిరాహార దీక్ష విజయవాడలో జరపాలని తీర్మానించడం జరిగింది.భవిష్యత్తులో ఉద్యోగ,ఉపాధ్యాయ,విశ్రాంతా ఉద్యోగులు,కార్మికులు ఎలాంటి పోరాటాలు నిర్వహించినా దానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని నిర్ణయించడమైనది.

3. ప్రభుత్వాన్ని తమ హక్కుల సాధన కోసం ప్రశ్నిస్తున్న సంఘ నాయకులను భయపెడుతూ వేధిస్తున్న ప్రభుత్వ చర్యలను ఈ రౌండ్ టేబుల్ సమావేశం తీవ్రంగా ఖండించింది.అనంతరం ఏఐటియుసి నగర కార్యదర్శి ఎం.సాంబశివరావు వందన సమర్పనతో సమావేశం ముగిసింది.

# త్రిపుర బరిలో కేంద్రమంత్రి.. భాజపా జాబితా విడుదల

**దిల్లీ:** ఈశాన్య రాష్ట్రం త్రిపుర లో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ముమ్మర ప్రచారం చేపడుతున్నాయి. తాజాగా అధికార భాజపా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. కేంద్రమంత్రి ప్రతిమా భౌమిక్‌ను ఈ ఎన్నికల్లో కాషాయ పార్టీ బరిలోకి దింపింది.

త్రిపురలో మొత్తం 60 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 48 అభ్యర్థులతో భాజపా తొలి జాబితా శనివారం ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సాహా టౌన్ బోర్డోవాలి నుంచి పోటీ చేస్తున్నారు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి ప్రతిమా భౌమిక్ అసెంబ్లీ ఎన్నికల్లో ధన్‌పుర్ నుంచి బరిలోకి దిగుతున్నట్లు భాజపా ప్రకటించింది. ప్రస్తుతం ఆమె త్రిపుర నుంచి ఎంపీగా ఉన్నారు. మిగతా 12 స్థానాలకు త్వరలోనే అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు భాజపా వెల్లడించింది.

త్రిపురలో ఫిబ్రవరి 16న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 2న ఫలితాలను వెల్లడించనున్నారు. 2018లో భాజపా–ఐపీఎఫ్‌టీ సంయుక్తంగా పోటీ చేసి 43 సీట్లు గెలుచుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎం కలిసి పోటీ చేస్తున్నాయి.

# మత్స్యకారుల సంక్షేమం లో రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుకు చేయూతనందిస్తాం

## - మత్స్యమిత్ర గ్రూపులు, ఫిష్ ఆంధ్రా పథక లబ్ధిదారులకు రూ.13.59 కోట్ల చెక్కును అందించిన నాబార్డు చైర్మన్

**(వి న్యూస్ నాగాయలంక) :** మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుకు చేయూత ను అందించి ఆదుకుంటామని నాబార్డు చైర్మన్ కె.వి.షాజీ అన్నారు. శనివారం నాగాయలంకలో ఆయన మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తో కలిసి కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు నాగాయలంక బ్రాంచ్ నూతన భవన నిర్మాణం, నాగాయలంక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు 256 మత్స్యమిత్ర గ్రూపులకు రూ.5.12 కోట్లు, 52 స్వయం సహాయక సంఘాలకు రూ.6.61 కోట్లు, 98 ఫిష్ ఆంధ్రా మినీ పథక లబ్దిదారులకు రూ.1.86 కోట్ల చెక్కు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని చెక్కులను పంపిణీ చేశారు. నాగాయలంక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాబార్డు చైర్మన్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా, ఫిష్ ఆంధ్రా, ఫిష్ రీటైల్ మార్కెట్స్, ఫిషింగ్ హార్బర్లు వంటి ఏర్పాట్లతో తీర ప్రాంతంలోని మత్స్యకారుల సంక్షేమాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు. స్వాతంత్ర్య సమరయోధులు డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య 1950 సం.లో కోఆపరేటివ్ మూమెంట్కు పునాదులు వేయడంలో వారి కృషి ఎనలేనిదని కొనియాడారు. అదే స్ఫూర్తితో నేడు నాబార్డు, ఆప్కాబ్ బ్యాంకుల సహకారంతో మత్స్యమిత్ర గ్రూపులు, ఫిష్ ఆంధ్రా పథకాల లబ్ధిదారులకు రూ.13.59 కోట్లు పంపిణీ చేశామన్నారు. తాను పుట్టిన కేరళా ప్రాంతంలో మత్స్యకారుల సాధక బాధలు ఎరిగివున్నానని, అదేరీతిలో ఈ తీరప్రాంత ప్రజలు పడుతున్న కష్టాలను తాను అర్థం చేసుకోగలనన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి బ్యాంకుల ద్వారా అమలవుతున్న అన్ని పథకాలను పారదర్శకంగా అమలు చేస్తామని చెప్పారు. అనేక పార్లమెంట్ కమిటీలలో సభ్యులుగా ఉంటూ పేద ప్రజల సమస్యలను తెలుసుకుని



వారి అభ్యున్నతికి ఈ విధమైన కృషి చేస్తున్న బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కృషి అభినందనీయమన్నారు. వ్యవసాయ రైతులకు ఏవిధంగానైతే కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఋణాలను మంజూరు చేస్తున్నామో అదేరీతిలో మత్స్యకారులకు కార్డుల ద్వారా రూ.2 లక్షల వరకూ ఎలాంటి పూచీకత్తు లేకుండా ఋణాలను అందిస్తామన్నారు. ఈ ప్రాంతంలో రెండవ పంట పండించేలా ప్రణాళికలు రూపొందించడానికి నిపుణులైన వ్యవసాయ శాస్త్రవేత్తలను ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు నవ ధాన్యాలు పండించడంతో పాటు మార్కెట్ చేసుకోవడానికి సహకారం అందిస్తామన్నారు. ఏటిమొగ బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. నాబార్డు అందిస్తున్న సహకారాన్ని కేంద్ర సహకార బ్యాంకులు అందిపుచ్చుకోవాలని కోరారు. బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ నాబార్డు, కేంద్ర సహకార బ్యాంకులు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ ప్రాంత మహిళల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికి స్వయం సహాయక సంఘాలకు ఋణాలతో పాటు ఫిష్ ఆంధ్రా పథకం ద్వారా 60 శాతం, 40 శాతం సబ్సిడీలతో కూడిన ఋణాలను అందిస్తున్నామన్నారు. సముద్రంలో చేపల జాడను కనుగొనే అధునాతన పరిజ్ఞానం నాబార్డు ద్వారా అందించడానికి ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. రైతులకు, మత్స్యకారులకు ప్రభుత్వ పథకాల ఫలాలను అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి నాబార్డు చైర్మన్ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గత మూడున్నర సంవత్సరాలుగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ వస్తున్నారని, నాగాయలంక తీరప్రాంత ప్రజల కష్టాలను తీర్చడంలో ముఖ్యమంత్రి చొరవ చూపారన్నారు. రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలు పూర్తిచేస్తూ మత్స్య సంపద తరలింపునకు తగిన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించనున్నదన్నారు. అనంతరం ఫిష్ ఆంధ్రా మినీ లబ్దిదారులకు ఋణ మంజూరు పత్రాలను అందించారు. నాబార్డు చైర్మన్ పదవి చేపట్టిన అనంతరం తొలిసారి నాగాయలంకకు విచ్చేసిన చైర్మన్ షాజీ, ఎంపీ బాలశౌరి లను కేడీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు సత్కరించి జ్ఞాపికలను అందించారు. శంకుస్థాపనలు చేసిన ఆవరణలో అతిథులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్. నాగి రెడ్డి, జాయింట్ కలెక్టర్ డా.అపరాజిత సింగ్, జిల్లాపరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల జాన్సీ, నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్. గోపాల్, ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. శ్రీనాథ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ పార్టీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం

## - విద్యార్థులు సబ్జెక్టుల పై పట్టు సాధించేలా విద్య బోదన అందిస్తున్నాం : కలెక్టర్ డిల్లీరావు

**(విన్యూస్, విజయవాడ):** ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాదించేలా విద్యబోదన అందించి ఉత్తమ ఫలితాలను సాధించడంతో పాటు పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతున్నామని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు.

స్థానిక పాయకాపురం ప్రభుత్వ జానియర్ కళాశాలను శనివారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు సందర్శించి ఇంటర్‌మీడియట్ విద్యార్థుల విద్యాబోదనను పరిశీలించారు. జువాలజీ బోటని సబ్జెక్టులపై జిల్లా కలెక్టర్ విద్యార్థులకు పలు ప్రశ్నలను అడిగి సమాదానాలను రాబట్టి విద్యా బోదన పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు వారు ఎంచుకున్న సబ్జెక్టులపై పూర్తి పట్టును సాధించేలా ఆయా సబ్జెక్టులలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యా బోదనను అందిస్తున్నామన్నారు. సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోదన అందించాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించడం జరిగిందన్నారు. సబ్జెక్టులలో ప్రతిభ కనపరిచే విద్యార్థులు వారు నేర్చుకున్న పాఠ్యాంశాలను మిగిలిన విద్యార్థులకు బోధించడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించేలా ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సిద్దం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి అదునాతన భవనాలను నిర్మించి మౌలిక వసతులను కల్పించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోదనను అందించడం జరుగుతుందన్నారు. నాడు–నేడు ద్వారా జిల్లాలో 598 పాఠశాలలు, కళాశాలల భవనాలను కోట్లాది రూపాయల వ్యయంతో ఆధునీకరించి పాఠశాలలకు రూపురేఖలను మార్చడం జరిగిందన్నారు. పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం, గదుల మరమ్మతులు, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటు, త్రాగునీరు సౌకర్యం కల్పించడంతో పాటు పెయింటింగ్ పనులు పూర్తి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డిల్లీరావు తెలిపారు.

కళాశాల పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ సిఎస్ఎస్ఎన్ రెడ్డి, అధ్యాపకులు కె. బాలరాజు, యం నిర్మలజ్యోతి, కె. శేఖర్‌బాబు, డి.సంధ్యారాణి, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. గంగరాజు, స్థానిక తహాశీల్ధార్ సిహెచ్ దుర్గాప్రసాద్, విఆర్‌వోలు నరేంద్ర, చైతన్య, జి.వి.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

## - అన్ని విభాగాల పరిశీలన.. రోగులతో మాటా-మంతి..



**(వి న్యూస్ తెనాలి) :** ప్రభుత్వ ఆసుపత్రి అంటే ప్రజలు భయపడకూడదుఏళ్లు గడచినా క్షేత్ర స్థాయిలో రోగులకు వసతులు లేవు సీటీ స్కాన్ యంత్రం ఏడాది క్రితం చెడిపోతే పట్టించుకోరా రక్త నిల్వలు తగ్గితే ఇవ్వడానికి జనసైనికులు సిద్ధంగా ఉన్నారు వసతుల కల్పనలో పాలకులు బాధ్యతగా వ్యవహరించాలి జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంలో ఉన్న వారి మీద ఉంటుందన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉన్నా సరిదిద్దుకోవాల్సిన అంశాలపై పాలకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సుమారు మూడు గంటల పాటు ప్రతి విభాగాన్ని పరిశీలించారు. ఓపీ సేవలు, అత్యవసర విభాగం, సీటీ స్కాన్, తల్లిపిల్లల వార్డులను సందర్శించారు. ప్రతి రోగినీ పలకరించి ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

# నారా లోకేష్‌కు యువగళం పాదయాత్రలో సంఘీభావం తెలిపిన సాగునీటి సంఘాల రాష్ట్ర సమాఖ్య



**(వి న్యూస్ కుప్పం):** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రెండవ రోజు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి పొత్తూరి రామాంజనేయ రాజు,ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కే.సతీష్ నాయుడు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర తదితరులు కలిసి సంఘీభావం తెలియ చేసిన పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం కుప్పం రూరల్ మండలం గణేష్ పురంలో నీరు చెట్టు పెండింగ్ బిల్లులపై పూర్తి వివరాలతో నారా లోకేష్ కు ఒక వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ... నీరు చెట్టు కార్యక్రమంలో అన్ని రకాల అనుమతులు అప్పటి జిల్లా కలెక్టర్ల నుంచి తీసుకొని పారదర్శకంగా రైతులు,నీటి సంఘాల ప్రతినిధులు ఉమ్మడి 13 జిల్లాల్లో 28,857 పనులు చేయడం జరిగిందని,దీనిలో బిల్లులు పూర్తిఅయ్యి సి.ఎఫ్.ఎం.ఎస్ లో టోకెన్ పడి రూ.1277 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా నీరు చెట్టు బిల్లులు పెండింగ్లో పెట్టి రైతులను వేదింపులకు గురిచేసిందని అన్నారు. ఈ పరిస్థితిలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంగళగిరిలోని జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నీరు చెట్టు ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి పనులు చేసిన రైతులకు, నీటి సంఘాల ప్రతినిధులకు అండగా ఉండి వారిని సమన్వయ పరిచి మన లీగల్ టీం ద్వారా సలహాలు సూచనలు ఇవ్వగా నీరు చెట్టు పనులు చేసిన రైతులు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుండి బిల్లులు చెల్లించమని 6210 మంది గౌరవ హైకోర్టులో రిట్ పిటిషన్ లు వేయగా ఆరువారాల్లో నగదు చెల్లించమని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన అమలు చేయకపోవడంతో ఇప్పటివరకు 3215 మంది దిక్కార పిటిషన్లు వేయగా రాష్ట్ర ప్రభుత్వం విధి లేని పరిస్థితిలో 2022 మార్చి నుంచి 2023 జనవరి వరకు రూ.650 కోట్ల నిధులు విడుదలకు 9 జీవోలు ఇచ్చి రైతుల ఖాతాల్లో నేటి వరకు సుమారు రూ.450 కోట్ల రూపాయలు జమ చేసిందని, నీరు చెట్టు పనులు చేసి మూడు సంవత్సరాలు పూర్తి కావడంతో సన్నా చిన్న కారు రైతులు నష్టాలు ఊభిలో కూరుకుపోయి నానా ఇబ్బందులు పడుతున్నాం నే విషయాన్ని నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన దీనిపై స్పందిస్తూ నీరు చెట్టు పనులు చేసిన రైతులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉ ంటుందని రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే మరిన్ని దిక్కర పిటిషన్లు హైకోర్టులో వేసి పనులు చేసిన రైతులకు అండగా ఉండాలని నీరు చెట్టు ఫిర్యాదుల విభాగానికి సూచన చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు జి.సురేష్ నాయుడు, ఎం.తిరుమలరెడ్డి,కె.మురళి నాయుడు, కే.సతీష్ రెడ్డి, ఎం.సుబ్బరాయలు నాయుడు,టి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు ఫిబ్రవరి 15 నాటికి నూరు శాతం పూర్తి చేయాలి

## - టిడ్కో గృహాలు, మౌలిక వసతుల అభివృద్ధి పనులు ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్



**(వి న్యూస్ గుడివాడ):** గుడివాడలో మల్లాయపాలెం టిడ్కో గృహా సముదాయాలలో మౌలిక వసతులు అభివృద్ధి పనులు ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాష అధికారులను ఆదేశించారు.

శనివారం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కొడాలి నాని మల్లాయపాలెం టిడ్కో గృహాలు సందర్శించి మౌలిక వసతుల అభివృద్ధి పనులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అన్ని బ్లాకుల్లో పర్యటించి నిర్మిస్తున్న సిసి రోడ్లు డ్రైన్లు గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణం పనులు డ్రైనేజీ నిర్మాణ పనులు నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి నెలాఖరులో ముఖ్యమంత్రి టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందించనున్నారని, ఈలోగా అన్ని బ్లాక్ లలో పవర్ సప్లై,వాటర్ సప్లై పనులు పూర్తి చేయాలన్నారు లేఅవుట్కు ఆర్చ్ నిర్మించాలన్నారు అంతర్గత రహదారులు నిర్మాణం వేగవంతం గావించాలని మౌలిక వసతులు పనులు 80% పైగా పూర్తయ్యాయి అన్నారు. అనంతరం ఇదే లేఔట్ ప్రక్కన జగనన్న లేఔట్ సందర్శించి గృహ నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుడివాడలో 77 ఎకరాలలో 9,000 మంది లబ్ధిదారులకు ఒకే చోట టిడ్కో గృహాలు నిర్మించినట్లు రాష్ట్రంలోనే అతిపెద్ద టిడ్కోలే ఆవుట్ కాగలదని తెలిపారు. దీని ప్రక్కనే మరో 7 వేల ప్లాట్లతో 180 ఎకరాల్లో లే ఓటు వేసి లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. గుడివాడ శాసనసభ్యులు కొడాలి నాని మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి సంకల్పాన్ని అమలు చేసే దిశగా అధికారులు నిరంతర కృషి చేస్తున్నారని అన్నారు గుడివాడ నియోజకవర్గ పరిధిలో 25 వేల మందిని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు ఇందులో భాగంగా టిట్కోలేవుట్లో 9000, జగనన్న లేఔట్ లో 7000 మొత్తం 16000 గృహాలు మల్లాయపాలెం లోనే నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా 6000 మందికి టిట్కో గృహాలు రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డిఓ పద్మావతి, టిడ్కో పి.వో చిన్నోడు, మున్సిపల్ కమిషనర్ మురళి, రెవిన్యూ మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

# చేసే పనిలో ఏకాగ్రత ఉంటే యువత విజయం సాధించవచ్చు




**(వి న్యూస్ సత్తెనపల్లి) :** చేసే పనిలో ఏకాగ్రత ఉంటే యువత విజయం సాధించవచ్చని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు అన్నారు. సత్తెనపల్లిలోని వేద ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్రం వారి సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో యూత్ లీడర్ షిప్ కమ్యూనిటీ డెవలప్మెంట్పై యువతకు శనివారం రెండవ రోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీపీ నరసింహారావు తన ప్రసంగం కొనసాగిస్తూ యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆ సమయంలో నేర్చుకున్నది భవిష్యత్తులోనూ వారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. యువతకు స్వామి వివేకానంద ఆదర్శనీయుడని అన్నారు. కార్యక్రమంలో న్యాయం వేద కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ చింతాడ సూర్య ప్రకాష్, న్యాయవాది పిట్టల సురేష్ బాబు, యోగా ప్రొఫెసర్ కొటికలపూడి లక్ష్మి, జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, కార్యదర్శి అన్నవరపు స్టాలిన్ బాబు, విజయశాంతి రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగ పై లక్ష్మి యువతకు శిక్షణను ఇచ్చారు.

# రథసప్తమి వేడుకలకు హాజరైన పురపాలక,పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



**(వి న్యూస్ మార్కాపురం):** మార్కాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు హాజరైన మంత్రి సురేష్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి సురేష్ నాలుగు మాడ వీధులు శేష వాహనం ఊరేగింపు లో పాల్గొని స్వామివారి పల్లకి నీ మోసిన మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ రథసప్తమి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి సురేష్.

# కృష్ణాజిల్లా నాగాయలంకలో జరిగిన విలేఖరిపై దాడిని తీవ్రంగా ఖండించిన నందిగామ మీడియా ప్రతినిధులు



**( వి న్యూస్ నందిగామ ) :** కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంకలో అధికార పార్టీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమేష్ మరియు ఎంపీ బాలసౌరి ల కార్యకర్తలు గ్రూపులుగా ఏర్పడి ఘర్షణ పడుతుండటంతో ఆ వీడియో చిత్రీకరిస్తున్న 99టివి విలేఖరిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించిన నందిగామ మీడియా ప్రతినిధులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీడియోను చిత్రీకరిస్తున్న 99టివి విలేఖరి శివ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, అలా విలేఖరులపై దాడులు వేయడం చాలా దారుణమని, దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వి న్యూస్ నందిగామ డివిజనల్ఇన్చార్జ్ కాశీ విశ్వనాథ్, రాజా, నందిగామ కంచికచర్లమీడియా ప్రతినిధులు ఎండి బాషా, ఇక్బాల్, వార్తలోకం నందిగామ డివిజనల్ఇంఛార్జ్ చందు, కరుణాకర్ , వనిత న్యూస్ సీతా రామ్, ఎన్ 75 న్యూస్ మీరా, ఆంధ్రప్రభ కుద్దుస్ , అమరావతి న్యూస్ మహేష్, మొదలైన వారు పాల్గొన్నారు.


## V స్మార్ట్ యాడ్స్

**Insurance**
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును. సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

**అద్దెకు ఇవ్వబడును**
జిల్లా కోర్టు సాయిబాబాగుడి ఎదురురోడ్డులో తూర్పు ఫేస్‌లో 1,2 ఫ్లోర్లలో కమర్షియల్ స్పేస్ అద్దెకు ఇవ్వబడును. బ్యాంకులకు, డాక్టర్లకు మొ॥గు వారు సంప్రదించండి. లిఫ్ట్ సౌకర్యం కలదు.
సంప్రదించండి: 7997883575 9347576464 9515237110

వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..
సంప్రదించండి 9848667347



**ఆర్గానిక్ తేనె** సెల్:7981850205
ఆర్గానిక్ తేనె
మచిలీపట్నంలో... ఆర్గానిక్ తేనె కోసం సంప్రదించండి: 7981850205

**మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు సదవకాశం**
వాటర్ సర్వీసింగ్ & ఇంజన్ ఆయిల్ (జనరల్ సర్వీస్‌తో)
కేవలం రూ. 449/-లకే బైక్ జాబ్ కార్డు ఇవ్వబడుతుంది.
ప్రతి ఒక్కరు ఈ అవకాశమును వినియోగించుకోవలసినదిగా మనవి.
నందిని ఆటోమొబైల్
అన్నిరకముల టూవీలర్ స్పేర్ పార్ట్స్ & ఇంజన్ ఆయిల్స్ మరియు టైర్లు లభించును.
సెల్ : 7396 7396 79
నవరంగ్ ఆటో కన్సల్టెన్సీ
లక్ష్మీటాకీస్ సెంటర్, డి-మార్టు రోడ్, మచిలీపట్నం - 521 002.
సెల్ : 9848520822

**శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము**
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.
వివాహ పొంతన పరిశీలింపబడును. సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి : 96407 54054-91828 17435

**తక్కువధరకే ప్రకటనలు**
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

**అమ్మబడును**
మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి: సెల్: 7032931205 సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం

**వంట మనిషి కావలెను**
మచిలీపట్నం జల్లువారితోట డీమార్టు వెనుక నలుగురు గల కుటుంబంనకు వంట మనిషి కావలెను. (నాన్‌వెజ్) సంప్రదించండి: (ఉదయం10 నుంచి2గంటల) సెల్:7032931205

**స్థలం అమ్మబడును.**
దోకిపర్రు వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో నిడుమోలు-కౌతవరం మెయిన్ రోడ్డులో 16సెంట్ల భూమి అమ్మకానికి కలదు. 60-120 సైజులో గల కమర్షియల్ భూమి కావల్సిన వారు వెంటనే సంప్రదించండి:
సంప్రదించండి: 7997883575 9347576464

# చదువుకు చేయూత నివ్వడం ఉత్తమమైన అభిరుచి

## - ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ
## - ఉత్తమ విద్యార్థికి నగదు విరాళం



**(వి న్యూస్ మచిలీపట్నం):** చదువుకు చేయూతనిచ్చే కార్యక్రమం శనివారం ఉదయం స్థానిక చిలకలపూడి పాండురంగ మున్సిపల్ హైస్కూల్లో జరిగింది. శ్రీ సాయన వీరభద్రయ్య– వీర రాఘవమ్మ సేవా సమితి ద్వారా రిటైర్డ్ ఏఎస్పీ సాయన సుశీల్ రావు అందించిన 5 వేల రూపాయల విరాళాన్ని ప్రముఖ న్యాయవాది లంకె శెట్టి బాలాజీ ,మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ చేతుల మీదుగా పాఠశాల ఉత్తమ విద్యార్థి సుంకర నరసింహకు అందజేశారు. ఈ సందర్భంగా లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఎంతో పెద్ద మనసుతో గత కొన్నేళ్లుగా చదువుకు చేయూతనిస్తున్న రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ సాయన సుశీలరావు సేవలు చిరస్మరణీయమన్నారు .తల్లిదండ్రుల పేరు మీద సేవా సమితి ఏర్పాటు చేసి తద్వారా పేద విద్యార్థులకు సహాయం అందించడం ఎంతో ఉత్తమైన అభిరుచి గా ఆయన పేర్కొన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన చిలకలపూడి పాండురంగ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థి సుంకర నరసింహ పాఠశాలలో ఉత్తమ విద్యార్థిగా గుర్తింపు పొందడం అలాంటి విద్యార్థికి సహకారం అందించటం అభినందనీయమన్నారు. సేవా సమితి అధినేత రిటైర్డ్ ఏఎస్పీ శాయన సుశీల రావు మాట్లాడుతూ సమాజం వికసించాలంటే విద్య తోనే సాధ్యమవుతుందని అందుకు అవసరమైనటువంటి చర్యలు ప్రభుత్వము తో పాటు సామాజికవేత్తలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. దానిలో భాగంగానే తన తల్లిదండ్రుల పేరు మీద సేవా సమితి ఏర్పాటు చేసి ఉత్తమ లక్షణాలు కలిగిన పేద విద్యార్థులకు సహకారం అందిస్తున్నామన్నారు. దీనిని మరింతమంది ఆదర్శంగా తీసుకుని చదువుకు విరివిగా సహాయపడాలని ఆకాంక్షను సుశీలరావు వెలిబుచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయని వివి కనకదుర్గ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లంకి శెట్టి వనజ, తాడేపల్లి రమేష్ సుంకర అనిత, జర్నలిస్టు కె వి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# యువగళం పాదయాత్ర



**(వి న్యూన్ మచిలీవట్నం):** శనివారం మచిలీపట్నం పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు లోకేష్ పాదయాత్ర పై వైసీపీ ప్రజా ప్రతినిధులకు మాట్లాడే నైతిక హక్కు లేదని టీడీపీ తెలుగు రైతు కృష్ణా జిల్లా అధ్యక్షులు గోపు సత్యనారాయణ జిల్లా కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్ , జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణి కుమార్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .... పేర్ని నాని , కొడాలి నాని లు నోటికి హద్దు అదుపు లేకుండా మాజీ మంత్రి నారా లోకేష్ పై విమర్శలు చేస్తే టీడీపీ శ్రేణులు సహించరన్నారు .లోకేష్ పాదయాత్ర లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనడం చూసి వైసీపీ ప్రజా ప్రతినిధులకు ,మంత్రులకు అసహనం పెరిగి అభద్రతా భావంతో మాట్లాడుతున్నారన్నారు .లోకేష్ ప్రజలు పడుతున్న భాదలు తీర్చే ప్రయత్నం చేయడం కోసమే యువగళం పాదయాత్ర చేస్తున్నారన్నారు .అప్పట్లో జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర ఈస్వార్థం కోసం చేసారని ప్రశ్నించారు .లోకేష్ పాదయాత్ర చేయడానికి అసలు ఏ అర్హత ఉందని బూతులు మంత్రి కోడలి నాని అనడానికి సిగ్గు ఉండాలి అని వారు ఎద్దేవా చేశారు .ఆనాడు మీ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అవినీతి కేసుల్లో జైల్లో ఉన్నపుడు జగనన్న వదిలిన బాణం అంటూ వైయస్ షర్మిల ఏ అర్హతతో పాదయాత్ర చేసారని వారు ప్రశ్నించారు .అసలు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏ ఎన్నికల్లో పోటీ చేయని వైయస్ షర్మిలయే పాదయాత్ర చేసినపుడు పంచాయతీరాజ్,ఐటీ శాఖ మంత్రిగా చేసి గ్రామాల్లో వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేయించి రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గ్రామాల్లో ఎల్ ఈ డి బల్బులు తీసుకువొచ్చి పంచాయతీ, పట్టణాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన నారా లోకేష్ పాదయాత్ర చేస్తే తప్పేంటి అన్నారు .ఎన్నికల్లో ఓడిపోయింత మాత్రాన పాదయాత్ర చేయకూడదని ఏ చట్టంలో ఉంది కొడాలి నాని చెప్పాలని వారు డిమాండ్ చేసారు .అన్న వదిలిన బాణం షర్మిల ఏ ప్రయోజనం కోసం ఆనాడు పాదయాత్ర చేసిందో కొడాలి నాని, పేర్ని నాని చెప్పాలని వారు అన్నారు .పాదయాత్రలో ప్రజల సమస్యలపై నారా లోకేష్ సంధించిన బాణాలు చూసి వైసీపీ ప్రజా ప్రతినిధులు ,నాయకులూ ,మంత్రలు భయపడుతున్నారని వారికీ ఓటమి భయం పట్టుకుందని వారు ఎద్దేవా చేశారు .ముఖ్యంగా కొడాలి నాని ,పేర్ని నాని లకు లోకేష్ ని విమర్శించే స్థాయి ,అర్హత లేదన్నారు .ప్రజల కష్టాలు తెలుసుకోవాలంటే పదవి, అర్హత అవసరంలేదని మానవనీయ కోణం ఉంటె చాలానే విషయాన్నీ వైసీపీ నేతలంతా గ్రహించాలని హితువు పలికారు .ఈ కార్యక్రమంలో పామర్తి లక్ష్మణ్ ,కొక్కు జయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు .

# జిల్లా కోర్టు కార్యాలయం పరిపాలన అధికారిని హెచ్చరించిన రాష్ట్ర సమాచార కమిషనర్



Sri Ilapuram Raja
State Information Commissioner

**(వి న్యూస్ విజయవాడ):** కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం (జిల్లా కోర్టు మచిలీపట్నం) ప్రధాన పరిపాలనాధికారి పౌర సమాచార శాఖ అధికారిని స.హ .చట్టం ఆర్జీలకు సరిగా సమాచారం ఇవ్వనందున రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురం రాజా హెచ్చరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స.హ చట్టం కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ మార్చి 6 తేదీ2013 తేదీన కోరిన సమాచారాన్ని సరిగా సకాలంలో ఇవ్వనందున ది. డిసెంబర్ 16 ,2017 తేదీన ,ఈ కేసును విచారించిన రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురం రాజా ఆర్జీలను పరిశీలించి సమాచారం ఇవ్వాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేస్తూ ఫిబ్రవరి 8 ,2023 తేదీన స్వయంగా హాజరు కావలసిందిగా ఆఉత్తర్వులలో పేర్కొన్నారు .రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సి.హెచ్ . మానవేంద్రరాయ్ జూన్ 15 , 2016న జారీచేసిన జ్యుడీషియల్ నోటిఫికేషన్ నెం. 14 అమలకు కృష్ణాజిల్లాలో జిల్లా జడ్జి తీసుకున్న చర్యలు అందుకు సంబంధించిన ఆఫీస్ నోట్ ఫైల్ కాపీల సమాచారాన్నిది.మార్చి 11 2017న కోరడం జరిగింది. స.హా .చట్టం ఆర్జీకి జిల్లా కోర్టు ప్రధాన పరిపాలన అధికారి (పౌర సమాచార అధికారి) సరిగా సకాలంలో సమాధానం ఇవ్వనందున రాష్ట్ర సమాచార కమిషనర్ కుది.మార్చి21,2017న ఫిర్యాదు చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోవడం కారణంగా హైదరాబాద్ సమాచార కమిషన్ లో ఉన్న కేసుల రికార్డులు ఆంధ్ర సమాచార కమిషన్ కు రావడంతో 2016, 2017, సంవత్సరాల కేసులు విచారణ ఇప్పుడుజరుగుతూ ఉన్నాయనిఅని ,రాష్ట్రంలోని కోర్టులలో సమాచార చట్టం సరిగ్గా అమలు కాని విషయాన్ని గమనించిన రాష్ట్ర సమాచార కమిషనర్ ఆ ఉత్తర్వులు జారీ చేశారు .సుప్రీంకోర్టు సైతం స.హ చట్టాన్ని గౌరవిస్తుంటే స్థానిక జిల్లా కోర్టులలో సమాచార హక్కు చట్టం బోర్డులు కూడా చాలాచోట్ల కానరావడం లేదుఅని, స.హ చట్టం కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.


# బాల్య వివాహాలు, గృహ హింస ను అరికట్టాలి

## - అమ్మ ఒడి తొలి బడి : కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణ




**(వి న్యూన్ మచిలీవట్నం):** మచిలీపట్నం శనివారం కంపాస్ నెట్ రూరల్ అసోసియేషన్ ఫర్ సోషల్ యాక్షన్ (క్రాసా) మై ఛాయిస్ ఫౌండేషన్ సంయుక్తంగా గ్రామీణ ప్రాంత మహిళలకు చట్టలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కృష్ణా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు, యువతకు సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, కుటుంబ వ్యవస్థ, మహిళల అక్రమ రవాణా,బాల్యవివాహాలు, గృహహింస, బాలకార్మికులు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ మాట్లాడుతూ భారత దేశంలో ధనిక, పేద కుల ,మత బేధాలు లేకుండా రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు ప్రసాదించిందని అన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉండాలని అన్నారు. సమాజంలో విలువలతో కూడుకున్న పిల్లలను సమాజానికి అందిస్తున్న మొదటి గురువు అమ్మ అని (అమ్మ వడి తొలి బడి అని) అన్నారు. నేటి యువతి,యువకులకు సమాజంలో బాధ్యతయుతంగా నడుచుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పాల్సిన అవసరం ప్రతి ఒక్క తల్లిదండ్రుల పై ఉందన్నారు . సమాజంలో విలువలతో కూడిన జీవనవిధానం చిన్నతనం నుంచే అలవర్చుకోవాలి అన్నారు. బాల్యం దేవుడిచ్చిన వరమని చిన్నతం నుండి పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్చుకుంటే సమాజంలో ఉన్నతమైన స్థానంలో ఉంటారని అన్నారు. సమాజం పట్ల క్రమశిక్షణ కలిగిన బాధ్యతాయుత పౌరులుగా ఉండాలని అన్నారు. యువతీ, యువకులు అసాంఘిక కార్యకలాపాలకి దూరంగా ఉండాలని అన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరు మంచి ప్రవర్తనతో స్ఫూర్తిదాయకంగా నిలవాలని అన్నారు . మహిళలు చట్టం పై అవగాహన పెంచుకొని తమ హక్కులను తెలుసుకోవాలి అన్నారు. బాల్యవివాహాలు, గృహ హింస ను అరికట్టాలి. ఈ కార్యక్రమంలో క్రాసా డైరెక్టర్ ఏసుపాదం, మై ఛాయిస్ సంస్థ డైరెక్టర్ వివియన్, స్టేట్ కోఆర్డినేటర్ క్రాంతి, ప్రోగ్రాం మేనేజ్మెంట్ రీనా , ప్రోగ్రాం పార్ట్నర్ మంగలేశ్, సునీల్ , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నంలోని రాజుపేట లో జరిగిన చోరీ



**(వి న్యూస్ మచిలీపట్నం):** బందరు రాజుపేట లో భారీ చోరీ జరిగింది.తాళాలు వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు చొరబడ్డారు. బాధిత కుటుంబం మూడు రోజుల క్రితం తిరువూరు లో ని బంధువుల గృహప్రవేశానికి వెళ్లినట్లు సమాచారం. తాళాలు వేసి ఉండడాన్ని గమనించి పక్కా పథకం ప్రకారం దుండగులు చోరీకి పాల్పడినట్లు సమాచారం. బాధితుడు రైస్ మిల్ యజమాని పద్మనాభుని నాగేశ్వరరావు కాగా మొత్తం మీద 150 కాసుల బంగారం, సుమారు లక్ష రూపాయల నగదును దుండగులు దొంగిలించినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి బందర్ డిఎస్పీ మాసుం భాష, ఇనకుదురుపేట సిఐ ఉమామహేశ్వరరావు, సిసిఎస్ పోలీసులు చేరుకున్నారు. క్లూస్ టీం సిబ్బంది దుండగుల వేలిముద్రలు సేకరించగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వార్త ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న దినపత్రిక " వి న్యూస్": సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి..



**(వి న్యూస్, కైకలూరు) :** స్థానిక మండల పరిధిలోని వరాహపట్నం గ్రామ సచివాలయం నందు, శనివారం సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి చేతుల మీదుగా, "వి న్యూస్ 2023 క్యాలెండర్" "ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వార్తా ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న పత్రిక" వి న్యూస్" అని కొనియాడడం జరిగింది. మరియు సామాజిక సమతుల్యతకు వార్తా పత్రికల పాత్ర అతి ముఖ్యమైనదని , వాటిలో" వి న్యూస్" దినపత్రిక తనదైన శైలిలో సృజనాత్మకతతో, తనదైన ముద్ర వేసుకున్న పత్రిక వి న్యూస్ అని ఉద్ఘాటించారు. రానున్న రోజుల్లో సామాజిక రుగ్మతలను కూకటి వేళ్లతో పెకిలించేలా మరింత పదునైన వార్తా కథనాలతో, వి న్యూస్ దినపత్రిక ముందుకెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణలో , పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి శ్రీనివాస్ , గ్రామ పెద్దలు , సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు మరియు స్థానిక' వి న్యూస్" దినపత్రిక ప్రతినిధి ఎన్. వి. ఆర్ పేరాజు( కైకలూరు నియోజకవర్గ ఏపీ ఎం పి ఏ అధ్యక్షులు) , తదితరులు పాల్గొన్నారు.

# వార్త ఆయుధంగా ముందుకు వెలుతున్న దినపత్రిక " వి న్యూస్"

## - సర్పంచ్ పొనుగు మాటి సామ్రాజవాణి



**(వి న్యూస్, మండవల్లి) :** స్థానిక మండల పరిధిలోని భైరవపట్నం గ్రామ సచివాలయం నందు, శనివారం సర్పంచ్ పొనుగు మాటి సామ్రాజ్యవాణి చేతుల మీదుగా, "వి న్యూస్ 2023 క్యాలెండర్'' ''ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వార్తా ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న పత్రిక" వి న్యూస్" అని కొనియాడడం జరిగింది. మరియు సామాజిక సమతుల్యతకు వార్తా పత్రికల పాత్ర అతి ముఖ్యమైనదని , వాటిలో" వి న్యూస్" దినపత్రిక తనదైన శైలిలో సృజనాత్మకతతో, వార్త ఆయుధంగా ముందుకు వెళుతున్న పత్రిక వి న్యూస్ అని ఉద్ఘాటించారు. రానున్న రోజుల్లో సామాజిక రుగ్మతలను కూకటి వేళ్లతో పెకిలించేలా మరింత పదునైన వార్తా కథనాలతో, వి న్యూస్ దినపత్రిక ముందుకెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణలో , పంచాయతీ కార్యదర్శి కే ప్రభాకర్ రావు, గ్రామ పెద్దలు అబ్రహం రత్న కుమార్ , స్థానిక ఎంపిటిసి నాగదాసు కిరీటి రాజు విఆర్ఓ సుబ్రహ్మణ్యం సచివాలయ సిబ్బంది కిరణ్, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు మరియు స్థానిక' వి న్యూస్" దినపత్రిక ప్రతినిధి ఎన్. వి. ఆర్ .రాజు, తదితరులు పాల్గొన్నారు.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279